


# ఆకలి

— భాను

గుడిసెలో గుడ్డిదీపం వెలుగుతూవుంది. గుడిసెలోని వారి బ్రతుకుల్లాగే మసక; మసక వెలుతురుతో వెలుగుతూవుంటే గుడిసెలోని చీకటి నంతటినీ తరమలేక; ఆరలేక అన్ని ఆశలు కోల్పోయిన వాడి ఒకే ఒక ఆశలా ఆ దీపం వెలుగుతూవుంది

గుడిసెలో సీత. వాడుతున్న పువ్వును వీడుతున్న అందంలాటి అందమున్న సీత-శ్రీమంతుల నుండి రిక్షావాడి వరకు అందరి ఆకలినీ తీర్చేసీత "అమ్మా ! ఆకలి" అని ఏడుస్తున్న పిల్లాడిఆకల్ని తీర్చలేక సీత.

ఆరోజు ఆమె అందాన్ని కొనుక్కోవడానికి ఎవరూ రాలేదు. ఆమె కారోజు బేరం ఏంలేదు. సీతలాటి వాళ్ళ బ్రతుకులకు పూట బత్తెం పుల్ల వెలుగే.

సీతకొడుకు ఏడుస్తున్నాడు ఆకలేసి ఏడుస్తున్నాడు "అమ్మా! ఆకలి" అంటూఏడుస్తున్నాడు. ఆరోజు వాళ్ళమ్మ దగ్గరకు ఎవరూ రాలేదని; ఎవరూ రాకపోవడం వల్ల డబ్బులేదని; డబ్బులేకపోవడం వల్ల వాడికి తిండిలేదని వాడికేం తెలుసు. వాడికి తెలిసిందల్లా ఆకలేస్తే అన్నం తినడం. ఆకలేస్తే అమ్మను అన్నం పెట్టమని అడగడం.

ఆరోజు వాడికెందు కన్నం లేదో సీత వాడికి చెప్పదలుచుకోలేదు. చెప్పినా వాడికర్థం చేసుకునే వయసు లేదు. సీతలాటి అమ్మ కడుపున పుట్టిన వాళ్ళు అప్పుడప్పుడు పస్తులతోవుండాలని వాడికేం తెలుసు !!

"అమ్మా ! ఆకలి" అన్నాడు వాడు.

"నా కడుపు నెందుకు పుట్టావురా !" అని కసిరింది సీత. వాడు ఏడుస్తున్నాడు. అన్నం పెట్టమని ఏడుస్తున్నాడు. ఏడ్వడానికి శక్తిలేకున్నా లేని శక్తి తెచ్చుకుని ఏడుస్తున్నాడు. వాడు ఆకలిగా వున్నాడు. ఆకలిగా వుండడంవల్ల నీరసంగా వున్నాడు.

"అమ్మా ! ఆకలి" అని తిరిగి అన్నాడు వాడు.

"ఊరుకో వెధవా !' అని అంది సీత 'ఆకలి! ఆకలి! ఆకలి! ... ఆకలివల్లే కదా నేనీ బజారు పువ్వు జీవితాన్ని గడుపుతున్నాను' అని అనుకొంది సీత.

"అమ్మా ! ఆకలి" ఏడుస్తూ అన్నాడు వాడు. వాడు మాటిమాటికి ఆకలి, ఆకలి అంటూంటే ఆమెకు ఆకలిమీద కోపం వచ్చింది. ఆకలితో వున్న తన కొడుకుమీద కోపం వచ్చింది.

సీత వాడ్ని కొట్టింది. కొడితే వాడాకలి తీరుతుందా? పిచ్చి సీత, 'కొడితే వాడాకలి తీరుతుందనుకుందేమో ! వాడు ఏడుపు మానలేదు. సరికదా ఏడుపు స్థాయిని హెచ్చించేడు. సమ్మెచేసే వాళ్ళకు నిరాహారదీక్ష ఓ ఆయుధమైనట్టు ఆకలితో వున్న ఆ పసివాడికి ఏడుపో ఆయుధం.

వాడికొక్కడికే ఆకలేస్తున్నదా? సీతకు మాత్రం ఆకలి వెయ్యడంలేదూ? పస్తులుండడానికి ఆమె అలవాటు పడిపోయింది.

సీత గుడిసె తలుపులవైపు చూసింది. ఆరోజు ఎవరూ రాకున్నా ఇంకా ఆమెకోసం ఎవరో వస్తారని ఆశ. ఎవరూ రావడంలేదు. తరుగుతున్న తన అందాన్ని పై మెరుగులతో పూరించాలని సీత ప్రయత్నిస్తున్నది. ఆ వచ్చేవాళ్ళకు మాత్రం తెలియదా ఆమె అందంతరిగి పోతున్నదని!తమకు కావలసిన ఆనందం ఆమె నుండి సరిగా లభించదని. అందుకే కాబోలు ఆరోజు ఎవరూ రావడం లేదు.

సీతకు తన వయసు పెరుగుతున్నదని, పెరుగుతున్న వయస్సుతోపాటు తన అందం తరుగుతున్నదని, తన అందం తరుగుతే తన వద్దకెవరూ రారని తెలుసు. ఆమె కలాటి ఆలోచనలు రాగానే ఆమె భావి జీవితం భయంకరంగా తోచింది. ఆరోజులాగే రోజూ ఎవరూ రాకపోతే ఆమె బ్రతుకెలా గడుస్తుంది. ఆ పసివాడి కడుపెలా నింపగలుగుతుంది?

వెలిగీ వెలగనట్టు వెలుగుతున్న దీవం ప్రక్కన బ్రతికీ బ్రతకనట్టు బ్రతుకుతున్న సీత నిశ్శబ్దంగా కూర్చుని ఆలోచిస్తూ వుంది. సీతకొడుకు ఏడ్వలేక ఏడ్వలేక ఏడుస్తున్నాడు. తల్లిముఖంకేసి దీనంగా చూస్తూ అంతకంటె దీనంగా ఏడుస్తున్నాడు.

ఏడ్చి: ఏడ్చి వాడేడవడం మానేసాడు. ఏడిస్తే లాభం లేదని: ఏడ్పువల్ల తన కడుపు నిండదని వాడికి తెలిసినట్టుంది. అదీకాక మొదలే ఆకలివల్ల నీరసంగా వున్న వాడు ఏడ్పువల్ల ఇంకా నీరసించిపోయాడు. ఇక ఏడవడానికివాడిలో సత్తువ లేదు.

వాడు తన తల్లికేసి చూశాడు. ఆమె: ఎటో

చూస్తు వుంది. వాళ్ళమ్మ ఆనాడు వాడికన్నం పెట్టలేదని వాడికి తెలిసిపోయింది.

వాడు లేచి గుడిసె బయటకు వెళ్ళాడు. గుడిసెలో లేకపోయినా కనీసం బయటైనా ఇంత అన్నం దొరుకుతుందేమోనని వాడి ఆశ.

వాడు బయటకు వెడుతుంటే సీత పట్టించుకోలేదు. వాడిని ఆపలేదు. ఆపిమాత్రం ఏం చెయ్యగలదు. వాడి ఆకల్ని చల్లార్చగలదా ! సీత అలాగే కూర్చుని వుంది.

బయటకు వెళ్ళి సీత కొడుకు అన్నం కోసం వీధులవెంటపడి వెతుకుతున్నాడు. ప్రతి పెంట కుప్పలో పారేసిన విస్తరాకుల్లోని ఎంగిలిమెతుకులైనా దొరుగుతాయేమోనని ఆకలితో; ఆశగా వాడు వెతుకుతున్నాడు. కాని వాడికేం దొరకలేదు.

వాడు మాత్రం నిరాశ చెందలేదు. తన ప్రయత్నాన్ని మానలేదు. వాడి ప్రయత్నం వృధా కాలేదు. కొద్దిపాటి దూరంలో వీధి దీపపు వెలుగులో ఓ పెంటకుప్పమీద విస్తరాకులో అన్నం కనిపించింది. వాడికి ప్రాణం లేచి వచ్చినట్లైంది. వాడు పరిగెత్తి ఆ విస్తరాకు వద్దకెళ్ళాడు. గబగబా అన్నాన్ని రెండు చేతుల్తో నోట్లో కుక్కుతున్నాడు. వాడి ఆకలి తీరింది. వాడికి నిద్రముంచుకొచ్చింది. అలాగే ఆ పెంట కుప్పల మీద వాడు నిద్ర స్థల మెరుగడు గదా !"

సీత ఆలోచనలనుండి బయట పడింది. తన కొడుకు గుడిసెలోనుంచి బయటకి వెళ్ళాడని అప్పుడామెకు జ్ఞాపకం వచ్చింది. 'వీడసలు బయట కెందుకెళ్ళినట్టు' అని మనసులో అనుకుంది. ఆమెకు వాడిమీద కోపం వచ్చింది. 'బయటకి వెళ్ళి ఇప్పుడా వెధవని వెతికి తీసుకు రావాలి' అని అనుకుంటూ ఆమెలేచింది. లేచి గుడిసె బయటకు వెళ్ళి గుడిసె తలుపు వేసింది.

గుడిసె బయట చీకటి. సీత బ్రతుకు లాటి భయంకరమైన చీకటి. ఆకలి లాటి చీకటి. ఆ చీకట్లో సీత. రోజూ జీవితంతో పెనుగులాడే సీత. తన కన్నకొడుకు కడుపు నింపలేని సీత కొడుకును వెతుక్కుంటూ ఆ చీకట్లో వెళుతూ వుంది.

అందరు రాత్రి పడుకుంటారు. సీతలాంటి వాళ్ళు కొందరు రాత్రుళ్ళు మేలుకుంటారు. వాళ్ళది రహస్య జీవితం. ఈ సంఘానికి తెలియని రహస్యం వాళ్ళ బ్రతుకు. సంఘం నిజాన్ని చూడలేదు. చూసినా చూడనట్టుంటుంది.

సీత తన కొడుకు కోసం వెతుకుతూ వుంది. అంతకు ముందు ఆమె తన బ్రతుకులో సుఖం కోసం వెతికింది. కాని ఆమెకా సుఖం దొరకలేదు. ప్రతి వీధి ఆమె గాలిస్తూ వుంది. కాని ఆమె కొడుకామెకు కనిపించలేదు. "వీడెక్కడికెళ్ళాడో" అని అనుకుంటూ ఆమె వెతుకుతూ వుంది.

సీతకు ఒక వీధిలో పెంటకుప్పల మీద పడుకొన్న ఆమె కొడుకు ఆమెకు కనిపించాడు. 'వెధవ ఎక్కడపడితే అక్కడే నిద్రపోతాడు' అని అనుకుంటూ వాడి దగ్గరకెళ్ళింది.

"లేరా ! లే !" అంటూ వాడిని తట్టి లేప ప్రయత్నించింది. కాని వాడు లేవలేదు.

"మొద్దు నిద్ర" అంటూ తిరిగి లేప ప్రయత్నించింది. అప్పుడామెకు తెలిసింది వాడు చచ్చిపోయాడని. పిచ్చికుక్కలు చావాలని మందు కలిపి పెట్టిన అన్నాన్ని తన ప్రాణం నింపుకోవడానికి తిని వాడు ప్రాణం కోల్పోయాడని ఆమెకు తెలియదు. ఆకలివల్లే చనిపోయాడని ఆమె అనుకుంటూ వుంది.

చచ్చిన తన కొడుకును భుజంమీద వేసుకొని సీత తన గుడిసెకేసి నడవసాగింది.

"జనుల వలన తిరస్కృతులు
సంఘానికి బహిష్కృతులు—
... ... ...
... ... ...
ఏడవకండేడవకండి"

అని ఎవరో చదువుతున్నారు.

ఆమె గుండె బాదుకోవడంలేదు. ఏడవడం లేదు. ఎండిన చెరువుల్లాటి ఆమె కళ్ళల్లో ఏడవడానికింకా నీళ్ళెక్కడున్నాయని ?

కాముకులఆకలికి ఆమె జీవితంబలై పోయింది.

కడుపులోని ఆకలికి ఆ పసివాడు బలైపోయాడు.

★

# కాఫీ దండకమ్

## —కోట రాధాకృష్ణమూర్తి

శ్లో॥ వందే అరేబియా దేశ జనితం.
వందే జగద్వ్యాపితమ్
వందే ఆశ్రిత రక్షణం, బలకరం,
వందే జగత్పాలకమ్
వందే ఇడ్లీ, మసాలదోశ సహితం,
వందే ప్రజా సన్నుతం
వందే కాఫి కళాత్మకం, భవహరం
వందే త్రిమూర్త్యాత్మకమ్.

ఓ కాఫి ! దైవ స్వరూపా, జగద్వ్యాపి, నిన్ను మది భావించి, అరకప్పు సేవించి నీ మీద చక్కనౌ, దండకం బొక్కటిన్, నే జెప్ప నను కట్టినాడన్గదా, నాదు జిహ్వాగ్రమందున్ సదావిల్చి వాక్శుద్ధి గల్గింపవేనన్ను కరుణించవే తల్లి.

బ్రహ్మశాప వశాన పాలుగా జన్మింప, పరమేశ్వరుడు పంచదారగా మారగా కమల నాభుడు కాఫి పౌడరాయను భువిని, తొలుదొల్తనిను జేయు తీరును వివరింతు. గింజల్ని గొనిదెచ్చి గిన్నెలో వేయించి, చూర్ణంబు జల్లించి, చన్నీళ్ళు తెర్లించి సమపాలుగా పాలు చక్కెరన్ గలబోసి, కప్పులో నిను నింపి, లిప్తుతోసిప్ జేయు, వాని కారోగ్యమ్ము వాని కైశ్వర్యమ్ము, వాణీశుడిచ్చునని వాసవుడు మెచ్చునని, వైవస్వతునితోడు వాల్మీకి జెప్పెనట. ఆబాలగోపాల మనుదినమ్మును నిన్ను అతిభక్తి సేవించ, కండలకు గుండెలకు కొండంత బలమొచ్చు, రక్తమ్ము శుద్ధియగు సత్వమ్ము వృద్ధియగు. కాళ్ళలో తీపులున్ కళ్ళలో వాపులున్. తుమ్ములున్ దగ్గులున్ తుడిచిపెట్టుక పోవు. అలసటల్ ఆయాసమున్న హితవులేమి అణగారి పోవును అడ్రసే లేకుండ. మెడనొప్పి తొడనొప్పి. నీరసం నిస్త్రాణ నీ పేరు విన్నంత నిముషంబులో పోవు. కలియుగంబున నిన్ను కనులారజూచినన్, నోరారద్రావినన్ కల్మషంబులు పోవు. పొత్తిళ్ళలోబిడ్డ పోరుపెట్టేవేళ అరస్పూను కాఫీని అమృతముతోగల్పి. అంగిటన్ బోయంగ, ఆ శిశువు యదగ్రోలి. అల్లర్ని తగ్గించు, హాయిగా నిద్రించు.

ఆఫీసులందున, అర్జంటు పేపర్స్ అడ్రసే లేకుండు అవకాశమున్నపుడు. కాఫీని దెప్పింప కార్యమ్ము సమకూరు, డస్కులో కాగితాల్ రిస్కేమి లేకుండ దక్కుత్తలైవచ్చు. బస్సు డ్రైవర్లు సిబ్బందులేకద తల్లి, క్లీనర్లు ఓనర్లు కింకరుల్ గద నీకు, కోర్టు పక్షులకీవు కొంగు బంగారమవు. సినిమ తీవులపాలి చింతామణివి తల్లి. కవిగాయకాదులకు కల్పవృక్షమ్మవై బాలెంతలకు నీవు భాగ్యదేవతవవు. చూలెంత నిను గ్రోలి సుఖముగా ప్రసవించు. పెళ్ళిళ్ళ యందు నువు పెత్తనమ్ము వహించి, అడపదడపా గొంతు దడుపు దుందుడుకు గాదె. ఉపనయన మందు నీ వుండి తీరగవలెను. అపర కర్మలయందు అవతరించుదువీవు. హోట్‌కాఫి బోసికొని. సట్ పౌడరేసి, సిగరెట్ ద్రావుచూ అలా ఫుట్‌పాతుపై బోవు పురుష పుంగవులెంత పుణ్యంబు జేసిరో పూర్వ జన్మము లోన. మాసాంత మందునో మధ్యమధ్యో కాఫిడబ్బాలలో నీవు దర్శనంబీకున్న, ఎదురింటి ముదితలను, పొరుగింటి పొలతులను, పక్కింటి బామ్మలను, బదులడిగి తెచ్చుటకు భయపడనిఇల్లాళ్ళ భక్తిపరికింపవే... అయ్యర్లు నిను నమ్మి ఆంధ్ర దేశమ్ములో హోటళ్ళుబెట్టుకొని. హోదాలు పెంచుకునిసంచుల్ని నించుకొని సౌఖ్యమున్నారమ్మ.

ఈ దండకంబిట్లు ఇంపుగావ్రాసితిన్, పోస్టులో వేసితిన్, సంపాదకులు దీన్ని చదువు చున్నప్పుడు నీవు దరినున్నచో నిక్కముగ మరువార "ప్రగతి" పత్రికలోన ప్రకటితం బవునమ్మ. ఎట్టి స్థితిలో చెత్త బుట్టలన్ జేర్పక, అచ్చులో జూచునట్లాశీర్వదింపవే. నీలీల నీగోల నే వ్రాయగా జాల. ఇట్టి నిస్వార్థంప నెటివారలకైన వటిమాటలతోడ వలపు పడదో తలి. కాబట్టి నిత్యమ్ము నీసాన్నిహిత్యమ్ము సత్యమ్ముగా మాకు సమకూర్చవే తల్లి సర్వే జన కల్పవల్లీ నమస్తే. నమస్తే. నమస్తే. నమః

★